

ప్రజా న్యూస్

నెటవర్క్

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 151,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,గురువారం , తేదీ :01-10-2026

క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు



20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్

యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి

డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్

అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన

పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ

అమరావతి: యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. మిగతా..2లో

ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు



ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 30: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో చికిత-సాహిల్ జోడీకి గోల్డ్ వరించింది. దీంతో ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించిన చికిత.. 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో సర్ణం సాధించిన పెద్దపల్లికి మిగతా..2లో

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...



- జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు
- సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ
- నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య
- గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ

మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా ఉద్యోగుల వల్లే

సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



- ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం
- కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.
- ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.
- రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని

హైదరాబాద్: పేదల సమస్యల పరిష్కార వేదికలుగా కలెక్టరేట్ కార్యాలయాలు సక్రమంగా ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన కలెక్టర్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు. అనంతరం అక్కడే కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రభుత్వ పాలన, ఉద్యోగుల బాధ్యతలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులు..

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులే కీలక ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు లేదా మిగతా..2లో

గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'.. వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష



- వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
- గామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 30: వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.

సహ పైలట్‌తో పోరాడి.. 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్



- సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రాణాలు కాపాడారు.
- ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు.

ఇంటర్నెట్ డెస్క్: దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఉగ్రవాద ప్రయత్నాన్ని అదే విమానానికి కెప్టెన్‌గా ఉన్న ఓ భారతీయుడు అడ్డుకున్నారు.

పునరుత్పాదక ఇంధన రంగానికి ఊతం.. రూ.1,86,405 కోట్ల నిధులు



- దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.
- ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎం ధార'పథకానికి ఆమోదం తెలిపింది.

ఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ 'పీఎం ధార'పథకానికి ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.1,86,405 కోట్ల నిధులు కేటాయించారు. సోలార్ లేదా విండ్ ప్లాంట్లు సాధారణంగా నగరాలకు దూరంగా (ఎడారులు లేదా మైదాన ప్రాంతాల్లో) ఉంటాయి. అక్కడ తయారైన కరెంట్‌ని అక్కడే ఉంచలేం. దాన్ని మన ఇళ్లకు, పరిశ్రమలకు చేర్చాలంటే భారీ ట్రాన్స్‌మిషన్ లైన్లు (విద్యుత్ తీగలు), సబ్-స్టేషన్లు, గ్రిడ్ వ్యవస్థ కావాలి. అక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌లోకి సురక్షితంగా తరలించడాన్ని మిగతా..2లో

అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి



- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- విపక్ష ఎంపీలు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే

ఢిల్లి : ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి ఓటరు జాబితా సవరణ లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి మిగతా..2లో

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం



- కామన్వెల్త్ పోటీల్లో సత్తా చాటిన ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళ
- చంద్రకళను అభినందించిన ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- పథకాలు సాధించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య

అమరావతి: అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు తమ సత్తా చాటారు. కెనడాలో జరిగిన కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్ చంద్రకళను గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం సత్కరించారు.

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా



హైదరాబాద్:పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. మిగతా..2లో

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం.. రూ.లక్ష కోట్లతో అభివృద్ధి



- రైజింగ్ రాయలసీమ కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు.
- రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.

కడప, సెప్టెంబర్ 30: 'రైజింగ్ రాయలసీమ' కోసం రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పోరాడుతున్నారని మంత్రి సవిత తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు సంఘీభావంగా పులివెందులలో టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు: కేటీఆర్

రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా ప్రకటిస్తాం.. రూ.లక్ష కోట్లతో అభివృద్ధి

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా సీఎం ప్రకటిస్తారని చెప్పారు. హార్టికల్చర్ హబ్ కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయిస్తామని వెల్లడించారు. ప్రతి ఎకరాకు నీరు అందించడంతో పాటు వేర్ హౌజ్, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలు చేపడతామని మంత్రి తెలిపారు. పులివెందులకు కూడా వైఎస్ జగన్ సాగు నీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. పులివెందులలో రూ.480 కోట్లతో తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందుల మున్సిపాలిటీలో ప్రజలు టీడీపీని గెలిపించాలని కోరారు. పులివెందుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మంత్రి సవిత స్పష్టం చేశారు.

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ పతకం గెలవడం అభినందనీయం

మరోవైపు, ఏషియన్ గేమ్స్‌లో ఏపీకి చెందిన స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, క్రీడాకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఏఉందని స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌లో ఏపీ అథ్లెట్లు పతకాలు సాధించేలా వారికి అన్ని విధాలా మద్దతు అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ అండగా నిలుస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కామన్వెల్త్ 75 కేజీల విభాగంలో చంద్రకళ రజతం గెలవడం అభినందనీయమని రఆయన కొనియాడారు. ఇదే సమయంలో, జపాన్‌లో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళ కాంపౌండ్ ఆర్చరీ జట్టు స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఫైనల్లో చైనాపై 238-234 స్కోరు తేడాతో విజయం సాధించింది. ఈ జట్టులో ఏపీకి చెందిన వెన్నం జ్యోతి సురేఖ కీలక పాత్ర పోషించారు. ఆమెతో పాటు చికిత తనపర్తి, ప్రతిక ప్రదీప్ సభ్యులుగా ఉన్నారు. జ్యోతి సురేఖకు ఇది ఏషియన్ గేమ్స్‌లో నాలుగో స్వర్ణం కావడం విశేషం. ఈ విజయాలు రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయి.

గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం'.. వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, అమలును మరింత పటిష్టం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు

చెందిన చికిత ప్రతిభపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. చికిత విజయం తెలంగాణ క్రీడా చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. చికిత పట్టుదల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఆసియా క్రీడలు 2026లో కాంపౌండ్ ఆర్చరీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికిత, సాహిద్ జోడి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. (బుధవారం) జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జంగ్యూన్, చోయ్ యోంగ్‌హీ జోడీని షూట్‌ఆఫ్‌లో ఓడించి చికిత, సాహిల్ జోడి స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో 157-157తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు షూట్‌ఆఫ్ నిర్వహించారు. ఈ సమయంలో చికిత, సాహిల్ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బుల్స్‌ఐని కొట్టడంతో భారత్ ఖాతాలోకి మరో పసిడి వచ్చి చేరింది.

సహ పైలట్‌తో పోరాడి.. 180 మంది ప్రాణాలు కాపాడిన భారతీయ పైలట్

సహ పైలట్ దాడి చేసినా.. ప్రాణాలకు తెగించి మరీ ఆయన 180 మంది ప్రయాణికులను కాపాడారు. ఓవైపు దాడిని ఎదుర్కొంటూనే.. మరోవైపు విమానం కూలిపోకుండా నియంత్రించారు. అనంతరం ష్లైదుబాయ్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన వార్త సంస్థలు వెల్లడించాయి. దాడిలో భారతీయ కెప్టెన్‌కు గాయాలయ్యాయి. కాగా ఒమన్‌కు చెందిన పైలట్ ఈ విమానాన్ని కూల్చడానికి ప్రయత్నించాడని సమాచారం. దీనికి అడ్డుగా ఉన్న భారతీయ పైలట్‌పై కత్తితో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారతీయ పైలట్ అతడితో పోరాడి.. ప్రయాణికులను రక్షించారు. ప్రస్తుతం ఇద్దరు పైలట్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పునరుత్పాదక ఇంధన రంగానికి ఊతం..

రూ.1,86,405 కోట్ల నిధులు

'పవర్ ఎవాక్యుయేషన్' అంటారు. ఇందుకోసం భారీ విద్యుత్ లైన్లు, గ్రిడ్‌లు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌ను దేశవ్యాప్తంగా నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తుంది. వ్యవసాయం, పట్టణ రవాణా రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర మంత్రి మండలి రూ.2,79,157 కోట్ల (సుమారు రూ.2.79 లక్షల కోట్లు) విలువైన మూడు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.

రబీ పంటలకు సవరించిన మద్దతు ధరలు

రబీ మార్కెటింగ్ సీజన్ 2027-28కి గానూ ఆరు ప్రధాన రబీ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా రైతులకు దాదాపు రూ. 90,962 కోట్ల లబ్ధి చేకూరనుంది.

నీట్ పేపర్ లీక్ ఎఫెక్ట్ - వచ్చే ఏడాది నుంచి ప్రవేశ పరీక్షల్లో మార్పులు - 'సీబీటీ' విధానంపై కేంద్రం కసరత్తు!

కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలు జరిపేందుకు కేంద్రం కసరత్తు- వచ్చే ఏడాది నుంచి స్టార్ట్ !

నీట్ ప్రవేశ పరీక్షను ఇకపై పెన్ అండ్ పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలోకి మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది నీట్ పేపర్ లీక్ అయ్యి, విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో ఈ వైద్య విద్య ప్రవేశ పరీక్షలను సీబీటీ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు.

ఈ ఏడాది ప్రారంభంలో నీట్ పేపర్ లీక్ జరిగిన తర్వాత, వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ ప్రణాళిక పరిశీలనలో ఉందని, నందన్ నిలేకని అధ్యక్షతన ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ నుంచి నివేదిక వచ్చిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని సదరు అధికారులు పేర్కొన్నారు. భారతదేశంలోని ప్రభుత్వ పరీక్ష వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి నందన్ నిలేకని అధ్యక్షతన కేంద్రం ఓ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఇకపై పెన్ -పేపర్ విధానానికి స్వస్తి!

ఇప్పటి వరకు నీట్ పరీక్షను పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహిస్తూ వస్తున్నారు. కానీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ) ఇప్పటికే చాలా ప్రవేశ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్టింగ్ విధానంలో నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ-మెయిన్స్ , సీయూఈటీ- యూజీ, పీజీ, యూజీసీ-నెట్ , సీఎస్ ఐఆర్ యూజీసీ-నెట్ వంటి పరీక్షలను సీబీటీ విధానంలోనే నిర్వహించడం జరుగుతోంది.

మంచిపేరొచ్చినా.. చెడ్డ పేరొచ్చినా ఉద్యోగుల వల్లే: సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 10.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 4 కోట్ల మంది ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కేవలం 3 శాతం మంది ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడుకున్న పనైనప్పటికీ, ఎంతో బాధ్యతగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు..

ప్రభుత్వానికి మంచి పేరొచ్చినా, చెడ్డ పేరొచ్చినా అది పూర్తిగా



ఉద్యోగుల పనితీరు వల్లే ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదనే భావన ప్రజల్లోకి వెళ్తుందని హెచ్చరించారు. అందరి సహకారంతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామని, ఇంకా అనేక సమస్యలు ఉన్నందున వాటిని ప్రజలకు నిత్యం సేవలందిస్తూనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.810 కోట్ల నిధులను విజయవంతంగా సాధించుకున్నామని సీఎం వెల్లడించారు. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తే దాన్ని బహిరంగంగా అభినందించడానికి తమకు ఎలాంటి శషభిషలు లేవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడే రాజకీయాలు, ప్రత్యర్థులు ఉంటామని... మిగతా సమయాల్లో రాష్ట్రం, కేంద్రం కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకునే ఆరోగ్యకరమైన ధోరణి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి

మొదటి పేజీ తరువాయి

ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ జుఎవీలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే .కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. "అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవస్థలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్- నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న దిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తాం."

మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన-యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు. మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "ప్రజల ఓట్లను దోచుకుని, మోసం చేస్తే ఇక ఈ దేశం ఎక్కడికి పోతుంది? ఇది మా విన్నపం కాదు, మా డిమాండ్. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఆందోళన తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ఓట్లను దోచుకున్నారు కదా? అసలు ఈవీఎం యంత్రాన్ని ఎందుకు ఉపయోగించారు? ఆ శివ ఖన్నా ఎవరు? అతను



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అతనికి ఆ సాఫ్ట్‌వేర్ ఎక్కడి నుంచి వచ్చింది? ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి దాని ద్వారా పూర్తిగా దోచుకున్నారు. వారు ఆ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఈఆర్ఓలను పూర్తిగా స్తంభింపజేశారు. మొత్తం వ్యవస్థను ప్రమాదంలో పడేశారు. సీఈసీ ఆ పదవిలో ఒక్క నిమిషం కూడా కొనసాగే అర్హత లేదు. తక్షణమే రాజీనామా చేయాలి. ఆయనతో పాటు ప్రధాని మోదీ కూడా రాజీనామా చేయాలి."

మమతాబెనర్జీ, టీఎంసీ అధినేత్రి

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మండిపడ్డారు. దేశంలో జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణను అనుభవిస్తున్న ఏకైక పౌరుడు జ్ఞానేష్ కుమార్ అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ...

మొదటి పేజీ తరువాయి

పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు



లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి.. 60 వేల మందికి పట్టాలు ఇచ్చాం

మొదటి పేజీ తరువాయి

మార్కెట్ విలువ రూ.52 వేల కోట్లని వెల్లడించారు.

అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టాం..

130 చ.గ లు యావరేజ్‌ను ఇచ్చామని, సరాసరి కోటి నుంచి రెండు కోట్ల ఆస్తిని అప్పగించామని సీఎం తెలిపారు. అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. యాభై, అరవై ఏళ్ల కలను సాకారం చేశామన్నారు. నిన్నటి వరకు ఆస్తి ఉన్నప్పటికీ దానిని ఉపయోగించే పరిస్థితి లేదని.. ఇప్పుడు పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి అని చెప్పుకొచ్చారు. 'ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వారికి పట్టాలు ఇచ్చాం.. ఇందుకు కృషి చేసిన మీ ఎమ్మెల్యేలు, అధికారులకు మీరు కృతజ్ఞత చెప్పాలి. ఎన్నికలలో మేము సుపరిపాలన అందిస్తామని చెప్పాం. మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం' అని అన్నారు.

అమ్ముకోవద్దు.. కాపాడుకోండి

ఐదేళ్ల విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించామని ముఖ్యమంత్రి అన్నారు. కూడు, గూడు, గుడ్డ పేదలకు ఇవ్వాలని అన్న ఎన్టీఆర్ మొదలు పెట్టారని.. అదే విధానాన్ని తాము అమలు చేసి పేదల గుండెలో ఆనందాన్ని నింపామని చెప్పారు. అబ్జక్షన్ లేని భూములను పేదలకు ఇవ్వాలని నిర్ణయించి అమలు చేశామన్నారు. 'ఇది వారసత్వ హక్కు.. మీరు అమ్ముకోవద్దు.. కాపాడుకోండి' అని సూచించారు. పేదలు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని ఆనందంగా జీవించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవలను సులభతరం చేశామని చెప్పారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇటువంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

రాజముద్రతో మీ ఆస్తులు మీకిచ్చాం..

2019-24 మధ్య ప్రభుత్వమే భూవివాదాలను ప్రోత్సహించిందని చంద్రబాబు విమర్శించారు. ప్రజల ఆస్తులపై వారి ఫొటోలు పెట్టుకున్నారని వైసీపీపై మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వంలో నా ఫొటో లేదు, నా మిత్రుడు పవన్ కల్యాణ్ ఫొటో లేదు. కేవలం ప్రభుత్వం రాజముద్రతో మీ ఆస్తులు మీకు ఇచ్చాం' అని వెల్లడించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా ఆస్తులు కొల్లగొట్టాలని చూశారని ఆరోపించారు. కీలుబొమ్మల్లాగా ప్రజలను ఆడించాలని చూస్తే ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్నారు. తాము ఆ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని.. పేదల ఆస్తులకు భద్రత, భరోసా కల్పించామని చెప్పారు. రూపాయి కూడా లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు.

వేగంగా అభివృద్ధి పనులు..

రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని సీఎం తెలిపారు. అన్ని రహదారుల నిర్మాణం చేశామని, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని అన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు ఇచ్చామని.. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తున్నామని చెప్పారు. వైసీపీ గొడ్డలి పార్టీ పట్టిసీమకు అడ్డుపడితే... తాము కట్టి చూపామన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్దకు 490 టీఎంసీల నీరు గోదావరి నుంచి మళ్లించామన్నారు. ఈ ఏడాది వర్షాలు లేవని.. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగు నీరు ఇచ్చామని తెలిపారు. 14 వందల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వెళుతున్నాయని, వంద టీఎంసీల నీరు తెస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



'మీకు హామీ ఇస్తున్నా.. పోలవరం పూర్తి చేస్తాం... నీటిని కృష్ణా డెల్టా, రాయలసీమకు మళ్లిస్తాం. కొంతమంది స్వార్థపరులు వారు బాగుంటే చాలు అనుకుంటారు. మేము అందరూ బాగుండాలని, ఆనందంగా ఉండాలని కోరుకుంటాం. గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణ రాష్ట్రాలకు నీటి కొరత ఉండదు. భవిష్యత్తులో 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. కృష్ణా పుష్కరాల సమయానికి గోదావరి, కృష్ణా నీరు పుష్కలంగా మనకి వస్తాయి. అభివృద్ధి, సంక్షేమం ఈ ప్రభుత్వానికి రెండు కళ్లు. పేదలకు ఆదాయ మార్గాలు చూపి జీవన ప్రమాణాలు పెంచాలి. రేపు ఉదయం ఆరు గంటలకే గుడ్ మార్నింగ్ చెప్పి పెన్షన్ అందిస్తాం. ఉద్యోగులకు ఆలస్యం అయినా.. పెన్షన్‌దారులకు ఆలస్యం చేయకుండా అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగింది. భవిష్యత్తులో ఏసీ బస్సులే కొంటాం.. పేదలు అందులోనే ప్రయాణం చేయాలి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం

యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

జెన్-జీ మార్పు కోరుకుంటోంది

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకు



ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

-రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి..

అక్టోబర్ 5లోగా పరిష్కారం లేకుంటే సమ్మె



తుని, సెప్టెంబర్ 30 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకులు తుని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గత 19 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ప్రస్తుతం నెలకు రూ.5,745 మాత్రమే వేతనం అందుతోందని ప్రతినిధులు తెలిపారు. కుటుంబ పోషణ భారంగా మారిందని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు. అక్రమ తొలగింపులను అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులను నివారించాలని విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం, అధికారులకు పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. జూన్ నెల వేతనం చెల్లించడం, 85 పనిదినాల అనంతరం డిమాండ్ తీసుకునే విధానంలో మార్పు, మూడు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి ఎపిఇ, ఎఫ్ఎలకు ఎఫ్ఇ వర్తింపు, 7,500 పనిదినాల విధానం రద్దు, మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం లేదా మరణం సంభవిస్తే రూ.25 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అర్హత, అనుభవం ఉన్న వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. పక్క గ్రామాల్లో చేయించిన పనిదినాలను సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ల పనిదినాల్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పనుల వివరాల నమోదుకు వినియోగించే ఎన్ఎంఎంఎస్, భువన్ తదితర అనువర్తనాల కోసం కొత్త ఐదో తరం సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు ఇవ్వాలని, నగదు రహిత వైద్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యాచరణ కమిటీ రాష్ట్ర నాయకులు కె. ఉమామహేశ్వరరావు, ఎ. గౌరిశంకరరావు, ఎం. హరినాథ్, ఎం. పోతురాజు, వి. నాగరాజు, సంఘం నాయకులు, సభ్యులు, గాంధీ రాజు, విజయ్ కుమార్, సీఐటీయూ నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

-గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యక్రమాలపై చర్చ

-ఓటర్ల సమన్వయంతో ఎన్నికల కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తాం: సర్వోత్తమ్‌రెడ్డి



(సూర్యాపేట జిల్లా) సెప్టెంబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి)నల్లగొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారైన రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యక్రమాలు, గ్రాడ్యుయేట్ ఓటర్ల సమన్వయంపై చర్చించారు. తనను అభ్యర్థిగా ఎంపిక చేసిన పార్టీ అధిష్ఠానానికి, పీసీసీ అధ్యక్షుడికి సర్వోత్తమ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి లో బిఆర్ఎస్ మాజీ శాసనసభ్యుని

ఘనంగా జన్మదిన వేడుకలు

హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వోడితల

సతీష్ కుమార్ జన్మదినం సందర్భంగా



ఎల్కతుర్తి సెప్టెంబర్ 30 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలి వద్ద బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ 61వ జన్మదిన వేడుకను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొని కేక్ కటింగ్ చేసి అనంతరం స్వీట్లు పంపిణీ కూడా చేశారుఅనంతరం పిట్టల మహేందర్ మాట్లాడుతూ హుస్నాబాద్ అభివృద్ధి ప్రదాత తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి హుస్నాబాద్ ప్రజల ప్రేమ ఆదరాబిమానాలు పొంది ఎవరికైనా సమస్య ఉందని తన ఇంటి తలుపు తడితే సహాయం చేసి చెప్పుకోనటువంటి గొప్ప నాయకుడు వోడితల సతీష్ కుమార్ నిండు నూరేళ్లు జీవించాలని అన్నారు
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీపతి రవీందర్ గౌడ్ తంగడ మహేందర్ ఎల్తూరి స్వామి గొల్ల మహేందర్ మునిగడప శేషు మేకల స్వప్న కడారి రాజు జూపక జద్సన్ తంగెడ నాగేష్ చెవుల తిరుపతి మదర్ హింగే రాజేశ్వరరావు వివిధ గ్రామాల సర్పంచులు మునిగడప లావణ్య బొంకురి రజిత అంబాల రాజు మాట్లా లింగయ్య పంజాల యాదగిరి యూత్ నాయకులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి గోడిశాల శ్రీకాంత్ (చిట్టి గౌడ్) పెండ్యాల లోకేష్ ముద్రబోయిన శ్రీకాంత్ (టింకు)బొంకురి కార్తీక్ ప్రవీణ్ భగవాన్ మహిళా నాయకులు కృష్ణవేణి భాగ్య మేరీ తదితరులు పాల్గొన్నారు

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

-ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

-ప్రభుత్వ పథకాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి

-ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్

-కల్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కుల పంపిణీ



ఉప్పల్, సెప్టెంబర్ 30 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) : ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పథకాలు అత్యంత పారదర్శకంగా అమలవుతున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శక ప్రక్రియలోనే జరుగుతున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఉప్పల్ వీ=నా కార్యాలయం లో ఉప్పల్ మండలానికి చెందిన 71 మందికి కల్యాణ లక్ష్మి మరియు షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు. అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితులను లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.

ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కళ్యాణ్ లక్ష్మి. షాదీ ముబారక్ పథకం కింద లబ్ధిదారులు ఎంపిక అత్యంత పారదర్శకంగా జరిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి,శ్రీపాల్, ఉప్పల్ ఆర్ఐలు ఎం. అశ్విని గౌడ్,ఎం.రాఘవ, జూనియర్ అసిస్టెంట్ ఎం, అనంతరాములు,ఎం, అలివేలి,పి,వెంకన్న, రెవెన్యూ సిబ్బంది,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

70వ ఎస్ జి ఎఫ్ . జిల్లా స్థాయి గట్కా టోర్నమెంట్--కమ్--సెలెక్షన్స్

బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.30 ప్రజా న్యూస్ నెట్వర్క్
కుత్బుల్లాపూర్ డివిజన్ (గణేష్ నగర్ డివిజన్), వెంకటేశ్వర నగర్లోని బచ్‌పన్ స్కూల్‌లో టీ వి ఆర్ స్కూల్ కరస్పాండెంట్ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ ఎస్ జి ఎఫ్ . జిల్లా స్థాయి గట్కా టోర్నమెంట్--కమ్--సెలెక్షన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, క్రీడా మైదానాన్ని ప్రారంభించి, క్రీడాకారులను అభినందించడం ఆనందంగా ఉంది.గట్కా కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా ధైర్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సంప్రదాయ మార్షల్ ఆర్ట్ అని పేర్కొంటూ, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి మరింత కష్టపడి ముందుకు సాగాలని సూచించాను.ఈ సందర్భంగా పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు మరియు నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, ఎంపికయ్యే క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించిన ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ బసుపల్లి నాగదీప్ గౌడ్, జ్ఞానేశ్వర్, మనోహర్, తేజ తదితరులు పాల్గొన్నారు.



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి - SIR ప్రక్రియను నిలిపివేయాలి

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 30
తొలగించిన అర్హుల ఓట్లను పునరుద్దరించాలి.అఖిల పక్ష రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం రేపు సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయండి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవీనుండి వెంటనే తొలగించి, ప్రజా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం లో వక్తలు డిమాండ్ చేశారు. నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి సుందరయ్య భవన్లో అఖిలపక్ష పార్టీలతో ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, ఎస్ఐఆర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు సభా అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు,కాంగ్రెస్ నాయకులు జర్జ్, ఎతీం నాయకులు శ్రవణ్ కుమార్ రెడ్డి,, టీజెస్ జిల్లా అధ్యక్షులు తులజారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రహేమాన్ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలు కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 13 కోట్ల మంది ఓట్లు కోల్పోయారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం
ఎస్ఐఆర్= ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు
తొలగించిన అర్హుల ఓట్లను వెంటనే పునరుద్ధరణ చేయాలని అన్నారు. ఫామ్ 6 గతంలో మాదిరిగా ఉండాలని అన్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనలను సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం పాటించాలని అన్నారు. సర్ ప్రక్రియను రద్దు చేయాలని రేపు ఉదయం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మాణిక్, రాజయ్య, ప్రవీణ్ రేవంత్,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు..



ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో TJMU విజయం సాధించాలని పిలుపు

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 30
తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎజీవీఖ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్) సంఘం విజయానికి కృషి చేయాలని నాయకులు, కార్మికులకు పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని కార్మికుల సమస్యలు, సంఘం ఎన్నికలపై నాయకులతో చర్చించారు. ఎజీవీఖ రాష్ట్ర నాయకులు హనుమంతు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.సంగారెడ్డి డిపోలోని ఆర్టీసీ కార్మికులు, నాయకులు సమన్వయంతో పనిచేసి ఎజీవీఖ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సమావేశంలో కోరారు.



ఎల్ఆర్ఎస్‌ను సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిరంతరం కొనసాగించాలి

-నాలా కన్వర్షన్‌పై ప్లాట్ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయాలి

-రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి: పంతంగి వీరస్వామి గౌడ్

(సూర్యాపేట జిల్లా)సెప్టెంబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ విధానాన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిరంతరం కొనసాగించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంతంగి వీరస్వామి గౌడ్ కోరారు. సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలా కన్వర్షన్‌పై ప్లాట్ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేసుకునేలా మార్గదర్శకాలు జారీ చేయాలని, 2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ.10 వేలు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించాలని, నిషేధిత భూముల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, ప్రధాన కార్యదర్శి వెన్నా శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు అమరవాది శ్రావణ్, కంభంపాటి అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ

-పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి: కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

-శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా.. ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి

:రికార్డులు, కేసుల దర్యాప్తుపై సమగ్ర పరిశీలన :

హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను కోదాడ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బుధవారం వార్షికంగా తనిఖీ చేశారు. సీఐ చరమంద రాజుతో కలిసి పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, పిటిషన్లు, వారెంట్లు, సిబ్బంది విధులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, ఆధారాల సేకరణను పకడ్బందీగా పూర్తి చేసి నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.

పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు :

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, పిటిషన్లు, వారెంట్లు, గుర్తుతెలియని కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ సూచించారు. ప్రతి కేసులో దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, పెండింగ్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. కోర్టు కేసులు, వారెంట్ల అమలు, నిందితుల హాజరు వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజల ప్రతి ఫిర్యాదుకు సత్వర స్పందన :

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సీసీటీఎన్ఎస్‌లో తప్పనిసరిగా నమోదు చేసి, దానిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యం :

మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సిబ్బందికి సూచించారు. సున్నిత ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా కొనసాగించాలని, రౌడీషీటర్లు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ మరింత పటిష్టం :

పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని డీఎస్పీ తెలిపారు. బీట్ అధికారులు తమ పరిధిలోని పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసుల భద్రతపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు :

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ నిర్వహణపై ప్రత్యేక సమీక్ష :

పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది



క్రమశిక్షణ, హాజరు, విధుల నిర్వహణ, సంక్షేమం తదితర అంశాలను డీఎస్పీ సమీక్షించారు. తనిఖీలో ఇచ్చిన సూచనలను నిర్ణీత గడువులోగా అమలు చేసి, వాటిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన డీఎస్పీ :

వార్షిక తనిఖీ అనంతరం ఎస్ఐలతో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మొక్క నాటారు. నాటిన మొక్కను బాధ్యతగా సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ చరమంద రాజు, ఎస్ఐలు చలికంటి నరేష్, హనుమాన్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హరితహారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

-పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఉప్పల్, సెప్టెంబర్ 30(ప్రజా న్యూస్ నెట్‌వర్క్) చిలుకానగర్ డివిజన్‌లోని ముస్లిం కబరస్థాన్ మరియు గ్రేవ్‌యార్డ్‌లో అధ్యక్షులు షేక్ అబు ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.కబరస్థాన్, గ్రేవ్‌యార్డ్ పరిసరాల్లో పచ్చదనం పెంపొందించేలా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమంలో ప్రజలు, స్థానిక నాయకులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.





హుజూర్‌నగర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోంది

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులు లబ్ధిదారులకు అందజేత

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ పట్టణంలో రాష్ట్ర మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనారోగ్యం తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు మరింత సహాయం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

హుజూర్‌నగర్ ప్రజాసేవకు గౌరవ డాక్టరేట్

-ఢిల్లీలో పిల్లుట్ల రఘుకు యూనివర్సల్ హానరరీ అవార్డు కౌన్సిల్ సత్కారం

-ఆరు సంవత్సరాలుగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు



(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :ఢిల్లీలో యూనివర్సల్ హానరరీ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘుకు గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తన స్వగ్రామంలో సుమారు రూ.30 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు రఘు పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలను సందర్శిస్తూ నిరుపేదలు, విద్యార్థులు, రైతులు, యువత, ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కోచింగ్ సహాయం, పేద కుటుంబాల వివాహాలకు సహకారం, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సాయం, పాఠశాలలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులకు సహకారం అందించినట్లు వివరించారు.

పాండురంగ దేవస్థానం అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం

భూముల ఆక్రమణలపై సర్వే.. షాపుల అద్దెలు, భక్తుల వసతి సౌకర్యాలపై చర్చ



పాయకరావుపేట, సెప్టెంబర్ 30 ప్రజా న్యూస్ నెట్వర్క్:
శ్రీ పాండురంగ దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ట్రస్ట్ బోర్డు కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ట్రస్ట్ బోర్డు చైర్మన్ మజ్జూరి నారాయణరావు స్థానిక విలేకరులకు వివరాలను వెల్లడించారు. దేవస్థానం అభివృద్ధి కుంటుపడిన అంశాలపై ఈవో దివ్య తేజతో చర్చించినట్లు నారాయణరావు తెలిపారు. దేవస్థానానికి సుమారు 36 ఎకరాల భూమి ఉందని, అందులో సుమారు రెండు ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు చెప్పారు. భూములను సర్వే చేయించి ఆక్రమణలను అరికట్టే అంశంపై ఈవోతో చర్చించినట్లు వివరించారు. దేవస్థానానికి చెందిన దుకాణాల అద్దెలు తక్కువగా ఉన్నాయని చైర్మన్ పేర్కొన్నారు. బయటి మార్కెట్లో ఒక్కో దుకాణానికి సుమారు రూ.15 వేల వరకు అద్దె వస్తుండగా, దేవస్థానంలోని దుకాణాలకు రూ.8 వేలలోపే వస్తోందన్నారు. దీనివల్ల దేవస్థాన ఆదాయానికి నష్టం జరుగుతున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలపై కమిటీ సభ్యులతో చర్చించినట్లు తెలిపారు.దేవస్థానంలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతున్నందున శుభకార్యాలకు వచ్చే వారికి వసతి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని నారాయణరావు అన్నారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. వర్షాల కారణంగా దేవస్థానంలోని కొన్ని దుకాణాలు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. వాటిని పునర్నిర్మాణం చేసే విధంగా చర్యలు చేపట్టాలని ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులంతా నిర్ణయించినట్లు చైర్మన్ మజ్జూరి నారాయణరావు వెల్లడించారు.


ఆపదలో ఆదుకున్న పెద్ద మనసు..

యువకుడి ప్రాణాలు నిలిపిన ఎంపీ బీఎంఆర్

మా బిడ్డకు ప్రాణదాత ఎంపీ బీదా మస్తాన్ రావు: 'థాంక్యూ బీఎంఆర్ సార్' అంటూ తండ్రి కృతజ్ఞతలు

సకాలంలో స్పందించి చికిత్స.. నిండు నూరేళ్లు పోసిన రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు

కావలి,
ఆపదలో ఉన్నామంటూ వచ్చిన బాధితులకు ఆపద్బాంధవుడిలా అండగా నిలవడంలో రాజ్యసభ సభ్యులు డా. బీదా మస్తాన్ రావు (బీఎంఆర్) ఎల్లప్పుడూ ముందుంటారని కావలి పట్టణానికి చెందిన కుట్టుబోయిన రఘు భావోద్వేగంతోకొనియాడారు.వివరాల్లోకి వెళితే.. కావలి పట్టణ పాతూరుకు చెందిన కుట్టుబోయిన వరుణ్ కుమార్ తీవ్ర అనారోగ్యానికి గురై చెన్నైలోని సిమ్స్ (ఆ×మీ) ఆసుపత్రిలో చేరారు. అక్కడ అతనికి అత్యవసరంగాశస్త్రచికిత్సలు నిర్వహించాల్సి వచ్చింది. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్థోమత లేకపోవడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న తండ్రి రఘు, రాజ్యసభ సభ్యులు శ్రీ బీదా మస్తాన్ రావు యాదవ్ గారిని ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకున్నారు.బాధితుడి పరిస్థితిని చూసి వెంటనే స్పందించిన ఎంపీ బీఎంఆర్ , ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి శస్త్రచికిత్సలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేయించారు. బీఎంఆర్ చొరవతో సకాలంలో వైద్యం అందడంతో వరుణ్ కుమార్ కోలుకుని ప్రస్తుతం పూర్తిగా ప్రాణాపాయం నుంచి బయటపడి క్షేమంగా ఉన్నాడు.తన కుమారుడి ప్రాణాలను కాపాడి కుటుంబంలో వెలుగులు నింపిన ఎంపీ బీదా మస్తాన్ రావుని తండ్రి రఘు స్వయంగా కలిసి "థాంక్యూ బీ.ఎం.ఆర్ సార్" అని రాసి ఉన్న ప్రత్యేక ఫోటో ఫ్రేమ్‌ను అందజేసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆపద సమయంలో దేవుడిలా వచ్చి ప్రాణాలు నిలిపిన ఎంపీ గారి దాతృత్వాన్ని, పెద్ద మనసును తమ కుటుంబం జీవితాంతం మరువలేదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో పోలీసుల అవగాహన కార్యక్రమం

విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

మహిళలు, బాలికల భద్రతపై పోలీసుల కీలక సూచనలు

(నడిగూడెం మండలం) సెప్టెంబర్ 30, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా నడిగూడెం పోలీసులు కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మునగాల సీఐ, నడిగూడెం ఎస్ఐ పాల్గొని మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, రోడ్డు భద్రత, మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

